క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బెహరా హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో డాక్టర్ బెహరా విజయరవితేజ, డాక్టర్ నరేంద్ర పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. మధుమేహం, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. వాకర్స్‌తోపాటు మురళీనగర్ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చంద్రమౌళి కోరారు.

గ్లౌజులు, జాకెట్ల పంపిణీ



పారిశుధ్య సిబ్బందికి గ్లౌజులు, జాకెట్లు అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా చేతి గ్లౌజులు, రేడియం జాకెట్లను పంపిణీ చేశారు. సీతంపేటలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్చిలో జీ 20 సదస్సు జరగనుందని, దేశ విదేశాలకు చెందిన ఎందరో ప్రముఖులు విశాఖ నగరానికి వస్తారని తెలిపారు. పారిశుధ్య కార్మికులంతా శ్రమించి మెరుగైన పారిశుధ్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, శానిటేషన్ సెక్రటరీ తేజ, సూపర్‌వైజర్ ఈశ్వరరావు, రాము, పద్మ, అన్నపూర్ణ, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొన్న ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న జి.సింహాచలం(65) కంచరపాలెం మెట్టు సమీపం దుర్గానగర్‌లో నివసిస్తున్నాడు. గురువారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు రైతుబజారు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం వైపు బైకుపై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో అతడు కిందపడి తలకి గాయమైంది. చికిత్స నిమిత్తం వృద్ధుడిని ఆస్పత్రికి తరలించారు. సింహాచలం కుమార్తె రమణమ్మ శుక్ర వారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని పవిత్ర

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్ర వారం నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరీ ప్రేక్షకులను అలరించింది. కల్లూరి శ్రీనివాస రావు శిష్యురాలు టీకె పవిత్ర మృదు మధురంగా కీర్తనలు ఆలపించి భక్తులను సంగీత సాగరంలో ఓలలాడించారు. హంసధ్వని రాగం, రూపక తాళం, మోహి రాగం, కల్యాణి రాగం, భైరవి రాగంలో పలు కీర్తనలు ఆలపించారు. ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, జె.సాయిచంద్రశేఖర్ మృదంగంపై వాద్య సహకారం అందజేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని పవిత్రను అభినందించారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న శర్మ

కంచరపాలెం: స్థానిక రెడ్డికంచరపాలెం కనక దుర్గమ్మ ఆలయంలో, గొల్ల కంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గామాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ కనకదుర్గమ్మవారికి కుంకుమ పూజలు, పూలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

పబ్లిక్ డిమాండ్

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



పాత పెట్రోల్ బంకు వద్ద గెడ్డలో కుప్పలుగా డెబ్రిస్, వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా సమీపంలో పాత పెట్రోల్ బంకు వద్ద ఉన్న గెడ్డ పూడికలతో నిండిపోయింది. చెత్తాచెదారం పేరుకుపోయి దోమల వృద్ధికి నిలయంగా మారింది. దీనికి తోడు గెడ్డలో ఒక పక్క అంతా డెబ్రిస్ పెద్ద పెద్ద కుప్పలుగా పడవేశారు. దీంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఇబ్బంది ఉంది. గెడ్డలో అంతపెద్ద ఎత్తున డెబ్రిస్ పేరుకుపోయినా.. సంబంధిత సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదు. పారిశుధ్య అధికారులు పరిశీలించి గెడ్డను శుభ్రతకు, డెబ్రిస్ వేయకుండా గట్టి చర్యలు చేపట్టాలి.

– పి.గణేష్, సీతంపేట

పైప్‌లైన్ లీకు.. తాగునీరు వృథా



గురుద్వారా పాత పెట్రోల్ బంకు వద్ద లీకవుతున్న పైప్‌లైన్ వాల్వ్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా సమీపంలో పాత పెట్రోల్ బంకు వద్ద వెన్నెల ఫంక్షన్ హాల్ ఎదుట తాగునీటి పైప్‌లైన్ వాల్వ్ లీకవుతోంది. సుమారు నెల రోజులుగా ఈ పరిస్థితి ఉంది. నీరు వృథా అవడమే కాక, సమీప ప్రజల తాగునీటి కుళాయిల ప్రెజర్ తగ్గుతోంది. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద కూడా పైపు లీకై తాగు నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి లీకును అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– పి.వెంకటరమణ, సీతంపేట

ఇబ్బందికరంగా గూడ్స్ వాహనాల పార్కింగ్



కొత్త రెడ్డికంచరపాలెం రహదారిలో నిలిపి ఉంచిన వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డు ముత్యమాంబ కూడలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే కొత్త రెడ్డి కంచరపాలెం, యల్లబిల్లివారి వీధి, గంగన్ననగర్, జోగారావునగర్ ప్రాంతాల ప్రజలు, వాహన చోదకులు అక్కడి హోల్‌సేల్ దుకాణదారులతో ఇబ్బంది పడుతున్నారు. ఈ దుకాణాలకు వచ్చే సరకులను అన్‌లోడ్ చేసేటప్పుడు రోడ్లకు ఇరువైపులా గూడ్స్ వాహనాలను నిలిపేస్తున్నారు. తుక్కు దుకాణాల సామగ్రిని రోడ్లపై వేస్తున్నారు. అటుగా నడిచే పాదచారులు తంటాలు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, వాహనాలను నిలిపి వదిలేయకుండా తగు చర్యలు చేపట్టాలి.

– జి.ఈశ్వరమ్మ, గంగన్ననగర్

నైపుణ్య సాధనతో ఉన్నతావకాశాలు



ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వారి సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవడానికి, నిపుణులతో మాట్లాడడానికి, వారి ప్రసంగాలను వినడానికి, ఉద్యోగావకాశాలపై సమాచారం పొందడానికి ఐఎస్‌టీడీ ఒక వేదిక గా ఉపయోగపడుతుందని తెలిపా రు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ ఒ.రామమోహనరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాఫ్టటెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, డి.దామోదరరావు, ఎస్.ప్రశాంత కుమారి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శరవేగంగా సామాజిక భవన నిర్మాణం



రేసపువానిపాలెంలో నిర్మిస్తున్న భవనం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో జాతీయ రహదారి పక్కన సామాజిక భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.20 లక్షలతో ఈ హాల్‌ను నిర్మిస్తున్నారు. భవనం పూర్తయితే స్థానికుల అవసరాలకు ఉపయోగంలోకి వస్తుంది. అన్ని సౌకర్యాలతో పనులు జరుగుతున్నాయి.

ఘనంగా స్నేహగీతిక సంస్థ ఆవిర్భావం



జ్యోతి ప్రజ్వలనతో సంస్థను ప్రారంభిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

సీతంపేట: యలమంచిలికి చెందిన కొంతమంది గాయనీ గాయకులు, నగరానికి చెందిన పలువురు గాయకులతో కలిసి ఏర్పాటు చేసిన స్నేహ గీతిక నూతన సంస్థ ఆవిర్భావ వేడుక శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. కళా సంస్థల ప్రముఖులు సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, ఫణి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు మూడు గంటల సేపు సినీ గీతాలతో సంగీత విభావరి నిర్వహించి అలరించారు. యలమంచిలికి చెందిన ఎ.నరసింహమూర్తి, పేరి గీత, వి.వి.చారి, కె.వి.సత్యనారాయణ, ఆర్.వి.ఆంజనేయులు, ఐ.సాంబశివరావు, తదితరులు ఈ సంస్థలో కమిటీ సభ్యులుగా ఉన్నట్టు మహమ్మద్ ఖాన్ ప్రకటించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ పార్కులో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ పార్కులో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పార్కు స్థలంలో చెత్తాచెదారం, విద్యుత్, కేబుల్ వైర్లు తగలబడటంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియలేదు. ఆకతాయిలు సిగరెట్ కాల్చి పడవేయటం, లేదా విద్యుత్, కేబుల్ వైర్ల నుంచి రాగిని సేకరించడానికి వైర్లు తగలబెట్టడంతో ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పార్కు స్థలం నిరుపయోగంగా ఉండటంతో చెత్తాచెదారం పడవేస్తున్నారని, పార్కులోకి ఎవరూ చొరబడకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కప్పరాడ పీహెచ్‌సీ సందర్శన



ఆరోగ్య కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న వెల్‌నెస్ కన్సల్టెంట్ ప్రతినిధి శాంతి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల కన్సల్టెంట్ ప్రతినిధి శాంతి సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు అమలవుతున్న తీరును వైద్యులను అడిగి ఆమె తెలుసుకున్నారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేసే విధానాలు, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ నళిని, డాక్టర్ సనపల రాజేంద్ర, కన్సల్టెంట్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం



మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో ప్రచారం చేస్తున్న కె.కె.రాజు, సీతంరాజు సుధాకర్ తదితరులు



మాధవధార ఈస్ట్ పార్క్‌లో పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

మద్రిపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కోరారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో మాధవధార ఈస్ట్ పార్క్‌ల్లో శుక్రవారం సీతంరాజు సుధాకర్‌తో కలిసి ఆయన ఎన్నికల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు మద్దతుగా నిలవాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సీతంతరాజు సుధాకర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పార్కులకు వచ్చిన వాకర్స్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో వచ్చిన సంచలనాత్మక మార్పులను, ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. వాకర్స్‌తో షటిల్ ఆడుతూ వారిని ఉత్సాహ పరిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటు తనకు వేయాలని కరపత్రాలను ఓటర్లకు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సీనియర్ నాయకురాలు పేడాడ రమణికుమారి, డైరెక్టర్ పైడి శ్రీను, సచివాలయ కన్వీనర్లు కృష్ణారావు మాస్టర్, స్వామి, అమర్‌రెడ్డి, 50, 51 వార్డుల సీనియర్ నాయకులు పాతపట్నం రామ్మోహన్, మహిళా నాయకులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

24వ వార్డులో విస్తృత ప్రచారం

సీతమ్మధార: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి కోరారు. ఈ మేరకు వార్డులోని నక్కవానిపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీతాకుమారి, కుసుమ, వినోద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు స్నేహ క్లబ్ వితరణ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులకు స్నేహ క్లబ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శి పున్నారావు, గురుకులం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జీవీఎంసీ 14వ వార్డుకు చెందిన ఓటర్ల జాబితాను శుక్రవారం కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు పరిశీలించారు. వార్డులో ఎక్కడెక్కడ, ఏ ప్రాంతంలో పట్టభద్రుల ఓట్లు ఉన్నాయో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కర్రి రామారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వ హించారు. ముందుగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం టీటీడీ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్–1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్–3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సర్టిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎస్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్–4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్–5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడండి



దొండపర్తిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: దొండపర్తిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తాగునీటిపై మూతలు సరిగా పెట్టుకోవాలని స్థానికులకు సూచించారు. డెంగ్యూ నివారణ పద్ధతులు, మలేరియా నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి శుక్ర వారం ఫ్రైడే–డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అనంతరం దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సందర్శించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల మీద వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.రమారెడ్డి, స్థానిక వైద్యులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయిదుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయామని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలి, శ్రీకృష్ణకు స్వర్ణాలు



వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలి వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.విన్సీ (కె.ఎల్.యూ)పై 21–8, 21–8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2–0 సెట్ల తేడాతో యశ్వంత్ (కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్–ఆదిత్య(వీఐటీ)జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం



నీలి మోహనకృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్‌ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురి చేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

ఏఎన్‌ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్‌ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్‌ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.